25 నుంచి కొత్త రేషన్ కార్డులు

- ఆగస్టు 10 వరకు మండల కేంద్రాల వారీగా పంపిణీ
- వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండండి
- ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు
- త్వరలో నాగార్జున సాగర్ ఆయకట్టుకు నీటి విడుదల
- కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సిఎం రేవంత్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జులై 25 నుంచి ఆగస్టు 10 వరకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లో కొత్త రేషన్ కార్డుల పంపిణీ చేపట్టాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి కలెక్టర్లను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో వర్షాలు, వానాకాలం పంటసాగు, సీజనల్ వ్యాధులు, రేషన్‌కార్డుల పంపిణీ తదితర అంశాలపె

జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రంలో 9695299 రేషన్ కార్డుల ద్వారా. 3.12 కోట్ల మందికి ఆరు కిలోల చొప్పున సన్న బియ్యం అందిస్తున్నామని అన్నారు. కొత్తగా దాదాపు 7 లక్షల కార్డుల పంపిణీకి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందనీ, దీంతో 31 లక్షల మంది లబ్ధి పొందుతారని చెప్పారు. "గతంలో రేషన్ షాపులపై ఆసక్తి ఉండేది కాదు. సన్న బియ్యంతో రేషన్ కార్డులకు డిమాండ్ పెరిగింది. కార్డుల పంపిణీ కార్యక్రమంలో మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు భాగస్వాములు కావాలి. కొత్త కార్డుల పంపిణీ నిరంతర ప్రక్రియ. ఆందోళన అవసరం లేదు" అని సీఎం అన్నారు. వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్లను ఆదేశించారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల ఆస్తి, ప్రాణ నష్టం జరిగితే ఎంతటి వారినైనా ఉపేక్షించమని హెచ్చరించారు. జూన్ నుంచి ఇప్పటి వరకు రాష్ట్రంలో 21 శాతం వర్షపాతం తక్కువ నమోదైనా గత మూడు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయని అన్నారు. అన్ని విభాగాలను అప్రమత్తం చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు. భారీ వర్షాల నేపథ్యంలో హైదరాబాద్ నగరంలో 150 బృందాలను ఏర్పాటు చేశామని చెప్పారు. వాతావరణ సూచనలకనుగుణంగా కమాండ్ కంట్రోల్ రూం నుంచి సమన్వయం చేసుకుని ముందుగానే టీంలను పంపిస్తున్నామని తెలిపారు. పోలీస్ కమిషనరేట్లకు సంబంధించిన ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో ఉండాలని ఆదేశించారు. జిల్లాల్లో పిడుగుపాటుతో జరిగే నష్టాల వివరాలు నమోదు చేయాలని ఆదేశించారు. గిరిజనులు అంటువ్యాధుల బారిన పడకుండా ఐటీడీఏ ప్రాంతాల అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. పీహెచ్‌సీ సెంటర్లు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యులు నిరంతరం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. పశువులకు సంబంధించి వెటర్నరీ విభాగం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. "రాష్ట్రంలో ఎరువులు అందుబాటులో లేవని కృత్రిమ ప్రచారం చేస్తున్నారు. ఫలితంగా రైతులు ఆందోళన చెంది షాపుల ముందు బారులు తీరుతున్నారు. ఎరువుల దుకాణాల్లో ఎంత స్టాక్ ఉందో బయట నోటీస్ బోర్డు పెట్టాలి. తెలంగాణకు కేటాయించిన ఎరువుల్లో 20 నుంచి 25 శాతం పక్కదారి పడుతున్నాయని కేంద్రం అంటోంది. పక్క రాష్ట్రాలకు అక్రమ రవాణా చేయడంతో పాటు ఇతర వ్యాపారాలకు సబ్సిడీ ఎరువులను వాడుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎరువులు పక్కదారి పడితే క్రిమినల్ కేసులు పెట్టండి. రైతులకు నష్టం జరిగే పని చేస్తే కఠిన చర్యలు తప్పవు. టోల్ ఫ్రీ నెంబర్లను షాపులతో పాటు బస్టాండ్లు ఇతర పబ్లిక్ స్థలాల్లో ఏర్పాటు చేయాలి" అని సిఎం అధికారులకు సూచించారు. ఈ ఏడాది కృష్ణా బేసిన్‌లో అంచనాలకు తగ్గట్టుగా వర్షాలు కురిసినప్పటికి గోదావరి బేసిన్‌లో వర్షాలు కురవ లేదని అన్నారు. ఈ క్రమంలో రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులు, చెరువులు, కుంటల నీటిని జాగ్రత్తగా ఒడిసిపట్టుకోవాలని సూచించారు. నీటి నిల్వలను అంచనా వేసుకుని వర్షాలనుగుణంగా వినియోగ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. అలాగే చెరువులు, కుంటలు, కాల్వలకు గండ్లు పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కృష్ణా బేసిన్ పరిధిలో ఇప్పటికే కొన్ని ప్రాజెక్టుల కింద నీటి విడుదల మొదలైనందనీ, త్వరలోనే నాగార్జునసాగర్ ఆయకట్టుకు నీటిని విడుదల చేస్తామని అన్నారు. గతేడాది రికార్డు స్థాయిలో 2 కోట్ల 85 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం ఉత్పత్తి చేసి తెలంగాణ దేశంలోనే నెంబర్‌వన్‌గా నిలిచిందని గుర్తు చేశారు. జిల్లా కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పర్యటించాలనీ, రోజు వారీగా ఏం పనిచేశారో తనకు తెలియజేయాలని సీఎం ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, వాకాటి శ్రీహరి, సీతక్క, సింఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. అలాగే కొత్తగూడెం నుంచి డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క, ఖమ్మం నుంచి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఈ సమావేశంలో పాల్గొన్నారు.



ఎటిసిల్లో ఫార్మా, లైఫ్ సైన్సెస్ కోర్సులు

- మూడు దశల్లో 111 సెంటర్ల అభివృద్ధి
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ల (ఎటిసి)లో ఫార్మా, లైఫ్‌సైన్సెస్ కోర్సులతో పాటు ఆధునిక శిక్షణ అందించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో తెలంగాణ రైజింగ్-2047కు అనుగుణంగా ఎటిసిల అభివృద్ధి, పురోగతిపై అధికారులతో సమీక్షించారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న కోర్సులు, పనుల పురోగతిపై సిఎం ఈ సందర్భంగా వారి నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో మూడు దశల్లో 111 ఎటిసిలను అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టినట్టు సిఎంకు అధికారులు వివరించారు. ఫేజ్-1లో 25, ఫేజ్-2లో 40, ఫేజ్-3లో 46 ఎటిసిలను అభివృద్ధి చేస్తామని చెప్పారు. ఇప్పటివరకు 49 ఎటిసిలు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. నిర్దేశిత సమయంలో అభివృద్ధి పనులు పూర్తి చేయాలని సిఎం వారికి సూచించారు. సకాలంలో ఎటిసిలను పూర్తి చేసేందుకు అవసరమైతే నైపుణ్యం కలిగిన నిర్మాణ సంస్థల సహకారం తీసుకోలన్నారు. జీనోమ్ వ్యాలీలో ఒక మోడల్ ఎటిసిని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఫార్మా, బయోటెక్నాలజీ, లైఫ్ సైన్సెస్ పరిశ్రమలకు అవసరమైన శిక్షణ అందించే కోర్సులను ఎటిసిల్లో నిర్వహించాలన్నారు. దానికి అవసరమైన స్థలం కేటాయింపుతో పాటు అధునాతన సెంటర్ ఏర్పాటుకు ప్రతిపాదనలు తయారు చేయాలని ఆదేశించారు. ఎటిసిల పనుల పురోగతిపై తాను ఆకస్మిక తనిఖీ చేస్తానని, తప్పులు దొర్లితే చర్యలు తప్పవని సిఎం హెచ్చరించారు.

గిగ్ కార్మికులకు సంక్షేమ నిధి, ప్రమాద బీమా

- సిఎం రేవంత్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గిగ్ కార్మికుల డేటా ఆన్‌లైన్‌లో ఉంచేలా, వారికి సంక్షేమ నిధి ఏర్పాటు చేయడంతో పాటు ప్రమాదబీమా, హెల్త్ ఇన్సూరెన్స్ వంటి సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ రేవంత్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో గిగ్ కార్మికుల సంక్షేమంపై ప్రతిపాదిత పాలసీపై సిఎం సమీక్షించారు. ఈ సందర్భంగా పలు అంశాలను అధికారులు వివరించారు. సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ప్రభుత్వం ప్రాతినిధ్యం వహించాలని ప్రతిపాదించారు. అనంతరం సిఎం మాట్లాడుతూ.. గిగ్ కార్మికుల పాలసీపై అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. ఇంకా ఏమైనా మెరుగైన అంశాలుంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. అంతిమంగా ప్రభుత్వం తీసుకురాబోయే పాలసీ ఆదర్శంగా ఉండేలా చూడాలని సూచించారు.

మల్లికార్జున ఖర్గేకు సిఎం శుభాకాంక్షలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గేకు సిఎం రేవంత్ రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు సోమవారం ముఖ్యమంత్రి ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. దార్శనికత కలిగిన నాయకుడు మల్లికార్జున ఖర్గే అని కొనియాడారు. ఆయన మంచి ఆరోగ్యంతో, సంతోషంతో అనేక సంవత్సరాలు దేశానికి, ప్రజలకు సేవలందించాలని ఆకాంక్షించారు.

దత్తతను ప్రోత్సహించాలి

- సన్‌ఫీస్ట్ మామ్స్ కార్యక్రమంలో మందిరా బేడి

హైదరాబాద్ : దత్తతను ప్రోత్సహించాలని సన్‌ఫీస్ట్ మామ్స్ మేజిక్ 'అడాప్షన్ ఇన్ ఇండియా' క్యాంపైన్‌తో వక్తలు పేర్కొన్నారని ఆ సంస్థ ఓ ప్రకటనలో తెలిపింది. కోల్‌కత్తాలో జరిగిన కార్యక్రమంలో ఐఎస్‌ఎస్‌ఎ ప్రతినిధి, నటీ మందిర బేడీ మాట్లాడుతూ.. దత్తత తల్లుల పట్ల పక్షపాతాలు ఉండకూడదని పేర్కొన్నారు. జన్యు బంధాలతో సంబంధం లేకుండా ప్రతి బిడ్డకు అమ్మ ప్రేమ అర్హమని తెలిపారు. ఈ చర్చలో ఐటిసి ఫుడ్స్ డిజిటల్ మార్కెట్ ఆఫీసర్ చీఫ్ షువదీప్ బెనర్జీ పేర్కొన్నారు.

స్విస్ నెట్‌వర్క్‌తో హెచ్‌సిఎల్ సాఫ్ట్‌వేర్ జట్టు

న్యూఢిల్లీ : భారత్‌లోని స్విట్జర్లాండ్ ఎంబసీ, స్విస్ బిజినెస్ హబ్ ఇండియా, స్విస్‌నెక్స్ (స్విస్ నెట్‌వర్క్)తో ఒప్పందం కుదుర్చుకున్నట్లు హెచ్‌సిఎల్‌సాఫ్ట్‌వేర్ పేర్కొంది. ఇందులో భాగంగా స్విస్‌నెట్‌వర్క్ వేదికకు ఇ-గవర్నెన్స్, హెల్త్‌కేర్, ఎడ్‌టెక్, అగ్రిటెక్ వంటి గవ్‌టెక్ రంగాల్లో డిజిటల్ పరివర్తనకు మద్దతును అందించనున్నట్లు తెలిపింది. "ఈ ఒప్పందం అర్థవంతమైన ఆవిష్కరణలను ప్రోత్సహించనుందని స్విట్జర్లాండ్ రాయబారి మాయా టిస్సాఫి పేర్కొన్నారు.

అన్నవరం దేవేందర్‌కు దాశరథి పురస్కారం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ ప్రభుత్వం 2025 సంవత్సరానికి గాను ప్రముఖ కవి, రచయిత అన్నవరం దేవేందర్‌కు దాశరథి కృష్ణమాచార్య సాహితీ పురస్కారాన్ని ప్రకటించింది. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం ఆయన జయంతి సందర్భంగా జులై 22న సాహిత్య రంగంలో విశిష్ట కృషి చేసిన వారికి అందజేస్తుంది. తెలంగాణ సంస్కృతి, ఉద్యమ స్ఫూర్తి ప్రతిబింబించే సాహిత్య రచనలకు గుర్తింపుగా ఈ పురస్కారం ఆయనకు లభించింది.

గ్రామపంచాయతీ కార్మికుల పక్షాన పోరాడేది సిఐటియు

- రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్




సమావేశంలో మాట్లాడుతున్న పాలడుగు భాస్కర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గ్రామపంచాయతీ కార్మికుల పక్షాన పోరాడేది సిఐటియు మాత్రమేనని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ అన్నారు. ములుగు జిల్లా వాజేడు మండలంలో సోమవారం గుమ్మడిదొడ్డి గ్రామంలో జరిగిన గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామపంచాయతీ కార్మికులకు సమయపాలన లేకుండా ఇష్టానుసారంగా పనులు చేయించుకుంటూ ప్రభుత్వం వెట్టిచాకిరి చేయించుకుంటూ శ్రమదోపిడి చేస్తోందని అన్నారు. కార్మికుల సమస్యలపై అనేకసార్లు సమ్మెలు చేసినప్పటికీ డిమాండ్లు పరిష్కరించడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో 29 రోజులు సమ్మె చేస్తే కార్మికుల సమస్యల పరిష్కరించేందుకు ఏమాత్రం శ్రద్ధ చూపలేదని, సమ్మె సందర్భంగా నాడు ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ అధికారంలోకి వస్తే గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారని గుర్తుచేశారు. ఉద్యోగ భద్రత కల్పిస్తామని, కనీస వేతనాలు అమలు చేస్తామని, బీమా సౌకర్యం కల్పిస్తామని, పని గంటలు తగ్గిస్తామని అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి రెండేండ్లయినా పట్టించుకోవట్లేదని అన్నారు. పైగా ఆందోళన చేస్తున్న కార్మికులను అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నదని తెలిపారు. మల్టీపర్పస్ వర్కర్స్ పేరుతో తీసుకొని 12 గంటలు పని చేయించుకుంటున్నారని, పని పట్ల కూడా స్పష్టత లేదని అన్నారు. ఇన్సూరెన్స్ సౌకర్యాలు లేక కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని, కుటుంబాల్ని ఆదుకోవాలని కార్మికులు ప్రభుత్వాన్ని అడుగుతుంటే.. మల్టీపర్పస్ వర్కర్స్‌పై ప్రభుత్వ బాధ్యత లేదని, వారు రోజు కూలీలని చెబుతూ చేతులు దులుపుకునే ప్రయత్నం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొన్ని గ్రామ పంచాయతీల్లో కార్మికులకు చెల్లించాల్సిన వేతనాల్లోనూ కోతలు విధిస్తున్నారని అన్నారు. దీనిపై ఉన్నత స్థాయి అధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే పోరాటాలు నిర్వహిస్తామని, దానికి ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. అనంతరం వాజేడు మండలంలోని 17 గ్రామపంచాయతీల్లో 60మంది కార్మికులు పాలడుగు భాస్కర్ సమక్షంలో సీఐటీయూలో చేరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి బల్గూరి మధు, జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్, నాయకులు దావుద్, కొప్పుల రఘుపతిరావు, మల్లారెడ్డి, కట్ల నర్సింహాచారి, నీలా దేవి, సమ్మక్క, కంబాలపల్లి కొండయ్య తదితరలు పాల్గొన్నారు.

కలెక్టర్ ఖాతాలో దళిత బంధు లబ్ధిదారుల నిధులు

- యూనిట్లు అమ్మకం, కొనుగోలు చెల్లుబాటు కాదు
- లబ్ధిదారులకు చెక్కుల పంపిణీలో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క



లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న డిప్యూటీ సిఎం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దళిత బంధు లబ్ధిదారుల నిధులు కలెక్టర్ ఖాతాలో ఉన్నాయని, ఎంచుకున్న వృత్తి, వ్యాపారాలు నిర్వహిస్తూ దశలవారీగా పొందాల్సిన నిధులను వినియోగించుకోవాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. సోమవారం ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గంలోని చింతకాని మండలంలో దళిత బంధు లబ్ధిదారులకు రెండో విడత 214 మంది లబ్ధిదారులకు రూ.4,63,15,725 నిధులకు సంబంధించిన చెక్కులను భట్టి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాను సిఎల్‌పి నేతగా ఉన్నప్పుడు చింతకాని మండలాన్ని దళిత బంధు పథకం కింద పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసినట్టు తెలిపారు. దళిత బంధు లబ్ధిదారులందరికీ నిధుల పంపిణీ కొనసాగుతుందని, ఎన్నికల తర్వాత తాను ప్రకటించినట్టుగా చెక్కుల పంపిణీ చేపట్టినట్టు తెలిపారు. చింతకాని మండలంలో మొత్తం 3465 మంది లబ్ధిదారులు ఉండగా ఇందులోని 1,387 యూనిట్లను విక్రయించడం, దారి మళ్లించడం చేశారని, దళిత బంధు యూనిట్లు ఇతరులు కొనుగోలు చేయడం, లబ్ధిదారులు వాటిని అమ్మడం చట్టరీత్యా చెల్లుబాటు కాదని తెలిపారు. దళిత బంధు యూనిట్లన్నింటినీ జిల్లా అధికారులు విచారిస్తున్నారన్నారు. ప్రస్తుతం 214 మంది లబ్ధిదారుల విచారణ పూర్తి చేసి రెండో విడత నిధులు పొందేందుకు అర్హులని గుర్తించి వారికి చెక్కులు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం చెక్కులు పొందిన లబ్ధిదారులు వృత్తి వ్యాపారాలు చక్కగా నిర్వహించుకొని ఆర్థికంగా బలోపేతం కావాలని అన్నారు. దారి తప్పిన యూనిట్ల వివరాలు ఇస్తే అధికారులు వాటిని విచారించి తిరిగి గాడిలో పెట్టే ప్రయత్నం చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ దురిశెట్టి అనుదీప్, ఈడీ నవీన్ కుమార్, తహసీల్దార్ టి కరుణాకర్‌రెడ్డి, ఎంపిడిఓ చుంచు రామయ్య, తెలంగాణ రాష్ట్ర హస్తకళల చైర్మెన్ నాయుడు సత్యం, వైరా ఎమ్మెల్యే రామదాసు నాయక్, మండల పార్టీ అధ్యక్షులు అంబటి వెంకటేశ్వరరావు, సీనియర్ నాయకులు మడుపల్లి భాస్కర్ గౌడ్, కొప్పుల గోవిందరావు, మైనారిటీ సెల్ మండల అధ్యక్షులు షేక్ పాషా, తోటకూరి ప్రగతి, ఓర్సు వీరభద్రంపాల్గొన్నారు.

డయాలసిస్ రోగులకు 'చేయూత'

- మరో 681 మందికి పింఛన్ల మంజూరు : మంత్రి సీతక్క
- రాష్ట్రంలో లబ్ధిదారుల సంఖ్య 8,721

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రజాసంకల్పంతో ముందుకు సాగుతున్న కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకున్నది. డయాలసిస్ చికిత్స పొందుతున్న మరో 681 పేద రోగులకు ఆర్థిక భరోసా కల్పిస్తూ పింఛను మంజూరు చేయబోతున్నట్టు ప్రకటించింది. పింఛను మంజూరు ఫైల్‌పై పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ (సీతక్క) తాజాగా సంతకం చేశారు. ఈ పింఛను డయాలసిస్ రోగులకు ఇతోధికంగా ఉపయోగపడుతుందని సీతక్క ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాకముందు రాష్ట్రవ్యాప్తంగా 4,011 మంది డయాలసిస్ పేషెంట్లు మాత్రమే పింఛను అందుకున్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్తగా ఇప్పటిదాకా 4,029 మంది డయాలసిస్ రోగులకు పింఛను మంజూరు చేసింది. తాజాగా మరో 681 మంది లబ్ధిదారులను కొత్తగా ప్రకటించింది. దీంతో రాష్ట్రంలో పింఛన్లు పొందుతున్న డయాలసిస్ రోగుల సంఖ్య 8,721కి చేరుకున్నది. ఈ పింఛన్లను ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ ద్వారా గుర్తింపు పొందిన వివిధ ఆస్పత్రుల్లో చికిత్స అందుకుంటున్న రోగుల వివరాల ఆధారంగా మంజూరు చేశారు. ట్రస్ట్ గుర్తించిన 681 మంది డయాలసిస్ రోగుల వివరాలను సెర్ప్(సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ) సాంకేతికంగా పరిశీలించి, ధ్రువీకరించిన అనంతరం పింఛను మంజూరు చేసింది. ఈ 681 మంది లబ్ధిదారుల్లో హైదరాబాద్‌లోనే 629 మంది వివిధ ప్రభుత్వ, ప్రయివేటు ఆస్పత్రుల్లో డయాలసిస్ చికిత్స పొందుతున్నారు.



అచ్యుతానందన్ ఆశయాలను కొనసాగిద్దాం

- సంస్మరణ సభలో బి వెంకట్, టి సాగర్ పిలుపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కరళ మాజీ ముఖ్యమంత్రి విఎస్ అచ్యుతానందన్ ఆశయాలను కొనసాగిద్దామని వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి వెంకట్, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి సాగర్ పిలుపునిచ్చారు. సోమవారం హైదరాబాద్‌లోని రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల రాష్ట్ర కార్యాలయంలో అచ్యుతానందన్ సంస్మరణ సభను నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కమ్యూనిస్టు ఉద్యమంలో అత్యుత్తమ నాయకుడు అనుభవజ్ఞుడైన అచ్యుతానందన్ మరణం పట్ల సంతాపం వ్యక్తం చేశారు. కేరళలో వివిధ ప్రజా సమస్యలపై పోరాటాలకు నాయకత్వం వహించిన సమర్థుడైన నాయకుడని అన్నారు. 2006 నుంచి 2011 వరకు ఆయన ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు శ్రామిక ప్రజల సంక్షేమం కోసం అనేక శాసన, పరిపాలనా చర్యలు తీసుకున్నారని వివరించారు. కేరళలో కమ్యూనిస్టు ఉద్యమం స్థిరమైన వృద్ధిని సాధించిందని చెప్పారు. కఠినమైన జీవన శైలి, సామాజిక న్యాయం పట్ల అచంచలమైన నిబద్ధతకు పేరుగాంచిన అచ్యుతానందన్ కేరళ రాజకీయాలపై చెరగని ముద్ర వేశారని అన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ వెంకట్రాములు, రాష్ట్ర కమిటీ సభ్యులు ఆర్ ఆంజనేయులు పాల్గొన్నారు.

ఆయన యువతరానికి స్ఫూర్తి : జాన్‌వెస్లీ

కేరళ మాజీ సిఎం, సిపిఎం సీనియర్ నాయకులు విఎస్ అచ్యుతానందన్ ప్రజాపోరాటాలు చిరస్మరణీయమని పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. ఆయన నేటి యువతరానికి స్ఫూర్తిని, మార్క్సిస్టు పార్టీకి శిరోధార్యమని అన్నారు. సిపిఎం వనపర్తి జిల్లా రాజకీయ శిక్షణ తరగతుల సందర్భంగా సోమవారం అచ్యుతానందన్‌కు సంతాపం తెలిపి.. ఆయన చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జాన్‌వెస్లీ మాట్లాడుతూ.. 1964లో సిపిఎం వ్యవస్థాపకుల్లో అచ్యుతానందన్ ఒకరని తెలిపారు. నాటి నుంచి తుది శ్వాస విడిచే వరకు నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి పని చేశారని, పేద, మధ్యతరగతి, కార్మిక, రైతు ఉద్యమాల్లో పనిచేస్తూ సమసమాజ స్థాపన కోసం ఎంతగానో కృషి చేశారని కొనియాడారు. 2006 నుంచి 11 వరకు కేరళ ముఖ్యమంత్రిగా పనిచేశారని, ఆ కాలంలో అనేక భూసంస్కరణలు తీసుకొచ్చి వేలాది ఎకరాల భూమిని పేదలకు పంపిణీ చేశారని గుర్తుచేశారు. అంతేకాదు ఉచిత విద్య, వైద్యం అందరికీ అందే విధంగా ఎంతగానో కృషి చేశారని అన్నారు. ప్రతిపక్ష నాయకుడిగా ఉన్నా ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వానికి అనేక సలహాలు, సూచనలు ఇచ్చేవారని తెలిపారు. స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో బ్రిటీష్ పాలకులకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో జైల్లో నిర్బంధించినా మొక్కవోని దీక్షతో ముందుకు సాగారన్నారు. ఉపాధి హామీ చట్టం, అటవీ హక్కుల చట్టం, సమాచార హక్కు చట్టం తీసుకురావడంలో కీలక పాత్ర పోషించారని చెప్పారు. ఆయన ఆశయ సాధన కోసం యావత్ పార్టీ శ్రేణులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సంతాప సభలో సిపిఎం వనపర్తి జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎండి జబ్బార్, డి.బాల్‌రెడ్డి, జి.ఎస్. గోపి, ఎం.రాజు, ఏ.లక్ష్మి, నాయకులు పాల్గొన్నారు.

ఎప్‌సెట్ సెల్ఫ్ రిపోర్టింగ్‌కు నేడే ఆఖరు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఇంజినీరింగ్, ఫార్మసీ కోర్సుల్లో 2025-26 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం ఎప్‌సెట్ (ఎంసెట్) మొదటివిడత కౌన్సెలింగ్ ప్రక్రియలో భాగంగా సెల్ఫ్ రిపోర్టింగ్ చేసేందుకు మంగళవారం వరకే గడువున్నది. ఈనెల 18న ఎప్‌సెట్ ఇంజినీరింగ్ అభ్యర్థులకు సాంకేతిక విద్యాశాఖ సీట్లు కేటాయించిన విషయం తెలిసిందే. రాష్ట్రంలో 95,256 మంది అభ్యర్థులు ఎప్‌సెట్ ఇంజినీరింగ్ ప్రవేశాలకు సంబంధించిన కౌన్సెలింగ్‌లో ధ్రువపత్రాల పరిశీలనకు హాజరయ్యారు. వారిలో 94,354 మంది అభ్యర్థులు 59,31,279 వెబ్‌ఆప్షన్లను నమోదు చేశారు. రాష్ట్రంలో 172 ఇంజినీరింగ్ కాలేజీల్లో కన్వీనర్ కోటాలో 83,054 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఎప్‌సెట్ మొదటి విడత కౌన్సెలింగ్‌లో 77,561 (93.3 శాతం) మంది అభ్యర్థులకు సీట్లు కేటాయించారు. ఇంకా 5,493 (6.7 శాతం) సీట్లు మిగిలాయి. వెబ్‌సైట్‌లో సెల్ఫ్ రిపోర్టింగ్ ద్వారా వివరాలను నమోదు చేసేందుకు మంగళవారం వరకు గడువున్నది. ఇతర వివరాల కోసం https:// tgeapcet.nic.in వెబ్‌సైట్‌ను సంప్రదించాల్సి ఉంటుంది.

టెట్ ఫలితాలు నేడే

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టీజీటెట్) రాతపరీక్షల ఫలితాలు మంగళవారం విడుదల కానున్నాయి. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ సంచాలకులు, టెట్ చైర్‌పర్సన్ ఈ నవీన్ నికోలస్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మంగళవారం ఉదయం 11 గంటలకు టెట్ ఫలితాలను విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా విడుదల చేస్తారని తెలిపారు. గతనెల 18 నుంచి 30 వరకు టెట్ పరీక్షలను ఆన్‌లైన్‌లో నిర్వహించిన విషయం తెలిసిందే. టెట్‌కు 1,83,653 మంది దరఖాస్తు చేశారు. వారిలో 1,37,429 (74.83 శాతం) మంది రాతపరీక్షలకు హాజరయ్యారు. 46,224 (25.17 శాతం) మంది గైర్హాజరయ్యారు. ఇందులో టెట్ పేపర్-1కు 63,261 మంది దరఖాస్తు చేయగా, 47,224 (74.65 శాతం) మంది పరీక్ష రాశారు. 16,037 (25.35 శాతం) మంది గైర్హాజరయ్యారు. పేపర్-2 మ్యాథ్స్, సైన్స్‌కు 66,686 మంది దరఖాస్తు చేస్తే 48,998 (73.48 శాతం) మంది పరీక్షకు హాజరయ్యారు. 17,688 (26.52 శాతం) మంది గైర్హాజరయ్యారు. టెట్ పేపర్-2 సోషల్ స్టడీస్‌కు 53,706 మంది దరఖాస్తు చేయగా, 41,207 (76.73 శాతం) మంది పరీక్ష రాశారు. 12,499 (23.27 శాతం) మంది గైర్హాజరయ్యారు.

దశాబ్దం గడిచినా హామీల అమలు జాడలేదు

- ప్రాణహిత చేవెళ్ల, పాలమూరు ఎత్తిపోతల పథకాలకు జాతీయ హోదా కల్పించాలి
- బనకచర్లపై గోడమీది పిల్లిలా కేంద్రం చర్యలు : ఎండి అబ్బాస్



సమావేశంలో మాట్లాడుతున్న ఎండి అబ్బాస్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రం ఏర్పడి దశాబ్దకాలం గడిచినా.. విభజన చట్టంలో ఇచ్చిన హామీలను ఇంతవరకు కేంద్ర ప్రభుత్వం అమలు చేయలేదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండి అబ్బాస్ అన్నారు. నదీ జలాల పంపకాలు, ప్రాజెక్టులకు జాతీయ హోదా, మెట్రోమార్గం పొడిగింపుపై ఎలాంటి కేంద్రీకరణ జరగలేదని.. గత సిఎంతో పాటు ప్రస్తుతం సిఎం పలుమార్లు విన్నవించినా మోడీ సర్కార్ బుట్టదాఖలు చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిజామాబాద్ సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. అనంరతం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ప్రాణహిత చేవెళ్ల, పాలమూరు ఎత్తిపోతల పథకాలకు జాతీయ హోదా కల్పించకుండా రాష్ట్రంపై కేంద్రం సవతి తల్లి ప్రేమ చూపిస్తున్నదని అన్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో పసుపు బోర్డును మూడు సార్లు ప్రారంభించినా.. ఇప్పటి వరకు విధివిధానాలు ఖరారు చేయలేదని తెలిపారు. జిల్లాకు కొత్త రైల్వే లైన్లు, విమానాశ్రయ హామీలపై అడుగు ముందుకు పడిన దాఖలాలు లేవన్నారు. ఎస్ఐఆర్ కింద ఓటర్ల మధ్యంతర సమీక్ష పేరుతో ఓటర్ల తొలగించడం దుర్మార్గమని.. ఈ అంశంపై మోడీ పార్లమెంట్‌లో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఓటు హక్కు పోతే అన్ని హక్కులు పోతాయని అన్నారు. 1987 ప్రతిపాదికగా చెప్పి 11 రకాల ధ్రువపత్రాలను తీసుకురావాలని చెప్పడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రస్తుతం బీహార్‌లో కొనసాగుతుందని త్వరలో రాష్ట్రంలో సైతం చేపట్టే అవకాశాలున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. బనకచర్లపై మోడీ ప్రభుత్వం గోడమీది పిల్లిలా వ్యవహరిస్తున్నదని, మిగులు జలాలు తేల్చి కేటాయింపులపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపులు పారదర్శకంగా చేపట్టలేదని.. కాంగ్రెస్ పార్టీ నాయకులకే కేటాయించినట్టు ఆరోపణలు వస్తున్నాయని తెలిపారు. రేషన్ కార్డులపై ప్రజలు ఆందోళన చెందుతున్నారని, వాటిపై స్పష్టత ఇచ్చి ప్రతి పేద కుటుంబానికి రేషన్‌కార్డు అందజేయాలని డిమాండ్ చేశారు. వర్షాలు పడక రైతులకు నష్టం వాటిల్లుతుందని, నీరు లేక పంటలు ఎండిపోతున్నాయని.. కరువు నివారణా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు బి.ప్రసాద్, పార్టీ జిల్లా కార్యదర్శి రమేశ్‌బాబు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పెద్దివెంకట్రాములు, నూర్జహాన్, పల్లపు వెంకటేశ్, శంకర్‌గౌడ్, జిల్లా కమిటీ సభ్యులు జంగం గంగాధర్, నన్నేసాబ్, కొండ గంగాధర్, సుజాత, విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు.



ఆ పాటతో ముగ్ధుడినయ్యాను

- తణికెళ్ల భరణి

ప్రజాశక్తి - హైదరాబాద్

మ్యూజిక్ డైరెక్టర్ అనుదీప్ దేవ్ మ్యూజికల్స్‌లో ఆవిష్కరించిన కైలాసవాస శివ' పాటకు తాను ముగ్ధుడినైపోయానని ప్రముఖ నటుడు తణికెళ్ల భరణి అన్నారు. ఈ పాటను సోమవారం నగరంలోని ప్రసాద్ ల్యాబ్స్ వేదికగా ఆవిష్కరించారు. ఈ పాట చూస్తే భావోద్వేగానికి లోనై కచ్చితంగా కాశీకి వెళ్లాలని అనిపిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సినీతారలు నిహారిక కొణిదెల, శ్రీనివాస్ అవసరాల పాల్గొన్నారు.

అనుమానాస్పదంగా యువకుడు మృతి

- కుళ్లిపోయిన స్థితిలో శవాన్ని గుర్తించిన స్థానికులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అనుమానాస్పదంగా యువకుడు మృతి చెందిన ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలం తోగూడెం గ్రామంలో సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తోగూడెం గ్రామానికి చెందిన ఇర్పా నరేష్ (35) ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నారు. కాగా, పాడుబడ్డ తన ఇంటి నుంచి దుర్వాసనలు రావడంతో స్థానికులు గుర్తించి బయ్యారం పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఇంట్లో కుళ్లిపోయిన స్థితిలో ఉన్న మృతదేహాన్ని గుర్తించారు. అది నరేష్‌గా నిర్ధారించిన పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మణుగూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు.

వొక్సన్ యూనివర్సిటీలో విద్యార్థి ఆత్మహత్య

- అఘాయిత్యానికి ముందు సెల్ఫీ వీడియో..

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బీటెక్ విద్యార్థి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలంలోని కంకోల్ వద్దనున్న వొక్సన్ యూనివర్సిటీలో జరిగింది. అఘాయిత్యానికి ముందు సెల్ఫీ వీడియో తీసుకున్నాడు. స్థానిక ఎస్ఐ రాజేష్ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. సరూర్‌నగర్‌కు చెందిన గున్నా ఋషికేశ్ రెడ్డి వొక్సన్ విశ్వవిద్యాలయంలో ఆర్కిటెక్ విభాగంలో రెండో సంవత్సరం చదువుతున్నాడు. అయితే ఈ నెల 19న స్నేహితులు ముగ్గురితో కలిసి అద్దె కారు తీసుకుని కొండపోచమ్మ ఆలయానికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో అద్దె వాహనానికి స్వల్ప డ్యామేజ్ జరిగింది. దాంతో అద్దె వాహన యజమాని రూ. 25 వేలు నష్టపరిహారంగా చెల్లించాలని కోరగా.. అప్పటికప్పుడు అతడి తల్లి రూ.5000 చెల్లించింది. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం నాలుగున్నర ప్రాంతంలో హాస్టల్ గదిలో విద్యార్థి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్యకు ముందు ఋషికేశ్‌రెడ్డి సెల్ఫీ వీడియో తీసుకుని 'నాకు ఎవరూ లేరని, సారి అమ్మ అని, ఐ లవ్ యూ అక్క (అద్వైత)' అంటూ వీడియో చిత్రీకరించాడు. కాగా, తన కుమారుని మృతిపై అనుమానం ఉందని ఋషికేశ్ తల్లి ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యూకో బ్యాంక్‌కు రూ.607 కోట్ల లాభాలు

హైదరాబాద్ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికం (క్యూ1)లో యూకో బ్యాంక్ నికర లాభాలు10 శాతం వృద్ధితో రూ.607 కోట్లకు చేరాయి. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.551 కోట్ల లాభాలు ఆర్జించింది. ఇదే సమయంలో బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం రూ.2,254 కోట్లుగా ఉండగా.. గడిచిన క్యూ4లో 7 శాతం పెరిగి రూ.2,403 కోట్లకు చేరింది. బ్యాంక్ నికర నిరర్థక ఆస్తులు 0.50 శాతం నుంచి 0.45 శాతానికి తగ్గాయి. స్థూల నిరర్థక ఆస్తులు 3.32 శాతం నుంచి 2.63 శాతానికి పరిమితమయ్యాయి. 2025 జూన్ ముగింపు నాటికి దేశ వ్యాప్తంగా 3,305 శాఖలు, హాంగ్‌కాంగ్, సింగపూర్‌లో ఒక్కొటి చొప్పున శాఖలు, 2575 ఎటిఎం శాఖలను కలిగి ఉంది. గడిచిన త్రైమాసికంలో బ్యాంక్ మొత్తం ఆదాయం 13.51 శాతం పెరిగి రూ.5,23,736 కోట్లుగా చోటు చేసుకుంది.

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కండి

కార్యకర్తలకు బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ పిలుపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

స్థానిక సంస్థల ఎన్నికలకు బిఆర్ఎస్ కార్యకర్తలు సిద్ధం కావాలని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. కోర్టు ఆదేశాల నేపథ్యంలో త్వరలోనే ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉన్నందున రాష్ట్ర వ్యాప్తంగా నియోజకవర్గ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించారు.

ఈ మేరకు పార్టీ ముఖ్య నేతలకు అయన పలు సూచనలు చేశారు. సమావేశాల్లో పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపిలు, జడ్పీ చైర్మన్లు, కార్పొరేషన్ మాజీ చైర్మన్లు, సీనియర్ నేతలు పాల్గొనెలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీను అమలుచేయకుండా కాంగ్రెస్ చేస్తున్న మోసాలతో పాటు రేవంత్ ప్రభుత్వ అవినీతి, అప్రజాస్వామిక విధానాలు, వైఫల్యాలను గ్రామగ్రామాన ప్రచారం చేయాలన్నారు. రైతు బంధు ఇవ్వకుండా అన్నదాతలకు చేసిన ద్రోహాన్ని ప్రజలకు వివరించాలన్నారు. అన్ని వర్గాల ప్రజల తరపున గత 20 నెలలుగా కాంగ్రెస్ పార్టీ పైన బీఆర్ఎస్ చేస్తున్న ప్రజా పోరాటాలు, నిరసన కార్యక్రమాలను ప్రజలకు గుర్తుచేసేలా పార్టీ కార్యకర్తలను సమాయత్తం చేయాలని సూచించారు.

మచ్చలేని మహానేత విఎస్ అచ్యుతానందన్

- కేరళలో అందరితోనూ గౌరవించబడ్డ వ్యక్తి
- ప్రజా ఉద్యమాల నిర్మాణంలో ఆయనది కీలక పాత్ర : బివి రాఘవులు
- ఎంబి భవన్‌లో అచ్యుతానందన్‌కు నివాళి


అచ్యుతానందన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బివి రాఘవులు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

దేశ రాజకీయాల్లో మచ్చలేని మహానేత విఎస్ అచ్యుతానందన్ అని సిపిఎం పొలిట్ బ్యూరోసభ్యులు బివి రాఘవులు చెప్పారు. ఆయన మరణం పార్టీకి తీరని లోటు అన్నారు. ఆయన ఆదర్శాలను పాటిస్తూ పార్టీని ముందుకు తీసుకెళ్లడమే నిజమైన నివాళి అని చెప్పారు. సోమవారం సాయంత్రం హైదరాబాద్‌లోని సిపిఎం రాష్ట్ర కార్యాలయం ఎంబి భవన్‌లో అచ్యుతానందన్ చిత్రపటానికి బివి రాఘవులు పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... సిపిఎం ఏర్పాటులో కీలకపాత్ర పోషించిన వారిలో ఆయనొకరని గుర్తుచేశారు. ఆ 32 మందిలో చివరన మరణించిన వారు విఎస్‌నే అని అన్నారు. జీవితంలో ఆటుపోట్లు ఎదురైనా సైద్ధాంతిక, ప్రజా పోరాటాల్లో రాజీపడని వ్యక్తి వీఎస్ అని చెప్పారు. దేశ కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రలో తనదంటూ ఒక ముద్ర వేసిన నేత అనీ, సైద్ధాంతిక అంశాలపై రివిజనిస్టుల ధోరణిని ప్రశ్నించి పోరాడిన వారిలో ఒకరని అన్నారు. తన 17 ఏండ్ల ప్రాయంలోనే ప్రజాపోరాటాల్లో పాలుపంచుకున్నారని గుర్తుచేశారు. కేరళలో భూస్వామ్య వ్యతిరేక వ్యవస్థకు వ్యతిరేకంగా జరిగిన పున్నప్రవాయిలార్ పోరాటంలో పాలుపంచుకున్న విషయాన్ని గుర్తుచేశారు. కేరళలో పేద ప్రజలకు భూములను పంచారనీ, పదిసెంట్ల ఇంటి స్థలాలను ఇచ్చారని వివరించారు. కేరళలో కమ్యూనిస్టులతో పాటు అని పార్టీల, సామాజిక తరగతుల వారితోనూ గౌరవింపబడ్డ, మన్ననలు అందుకున్న మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. కేరళలో కమ్యూనిస్టు విముక్తి ఉద్యమాన్ని ఆనాడు ఇందిరాగాంధీ తీసుకొస్తే... సమైక్య కేరళ నిర్మాణంలో ఆయన పాత్ర మరువలేనిదన్నారు. ఎమర్జెన్సీ కాలంలో తీవ్ర నిర్బంధాన్ని ఎదుర్కొన్న నేతల్లో విఎస్ ఒకరన్నారు. కేరళలో ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా కమ్యూనిస్టు ఉద్యమాన్ని తీర్చిదిద్దడంలో ఆయన పాత్ర మరువలేనిదని కొనియాడారు. పలువురు ముఖ్యనేతలతో ఆయన వేసిన బీజాలే అక్కడ పార్టీ బలంగా ఉండటానికి కారణమని చెప్పారు.

ఇక్కడ సుందరయ్య లాగానే కేరళలో మన్ననలు అందుకున్న ముగ్గురు, నలుగురు నేతల్లో విఎస్ ఒకరన్నారు. ఆయన మరణం పార్టీకి తీరని లోటు అని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు టి సాగర్, పి ప్రభాకర్, బండారు రవికుమార్, మాజీ ఎంపి మిడియం బాబూరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు బాబూరావు, టి స్కైలాబ్‌బాబు, పి ఆశయ్య, ఉడుత రవీందర్, సీనియర్ నాయకులు పి రాజారావు, అరిబండి ప్రసాదరావు, వంగూరు రాములు తదితరులు పాల్గొన్నారు.

జిఓ నెంబర్ 49 నిలుపుదల



- అధికారులకు సిఎం ఆదేశం
- మంత్రి సీతక్క హర్షం
- పోరాటాల ఫలితమే ఆ జీవో నిలుపుదల - టిఎజిఎస్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కొమరం భీమ్ కన్జర్వేషన్ కారిడార్ ఏర్పాటు కోసం ప్రకటించిన జిఓ నెంబర్ 49ను ప్రభుత్వం నిలుపుదల చేసింది. ఈ మేరకు సిఎం రేవంత్ రెడ్డి సోమవారం అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఆదివాసి ప్రజల అనుమానాలు, ఆందోళనల నేపథ్యంలో ఆ జీవోను ప్రభుత్వం నిలుపుదల చేసింది. ఈ ఏడాది మే 30న జీవో నెంబర్ 49ని ప్రభుత్వం విడుదల చేసింది. నాటి నుంచి నేటి వరకు తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘంతో పాటు ఇతర గిరిజన సంఘాలు జెఎసిగా ఏర్పడి జీవోను రద్దు చేయాలంటూ దశలవారీగా పోరాటాలు నిర్వహించాయి. ప్రత్యేకంగా టిఎజిఎస్ ఆధ్వర్యంలో జీవో కాపీల దహనం కార్యక్రమంతో పాటు ఎంఆర్‌ఓలకు, కలెక్టర్లకు వినతి పత్రాలు సమర్పించారు. జూన్ 30న ఐటీడీఎలను ముట్టడించారు. సోమవారం ఆదివాసీ సంఘాలు, సిపిఎం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బంద్‌కు పిలుపునిచ్చాయి. ఈ కార్యక్రమంలో ఆదివాసీలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఈ క్రమంలో గిరిజనుల్లో పెరుగుతున్న అసంతృప్తిని గమనించిన ప్రభుత్వం జీవో 49ని నిలుపుదల చేసినట్టు ప్రకటించాల్సి వచ్చింది.

కాగా సిఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు జిఓను నిలుపుదల చేస్తూ అటవి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరి అహ్మద్ నదీం మెమో జారీ చేశారు. ఆ జీవోని, నిలుపుదల చేయడం పట్ల పంచాయత్ రాజ్ గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క హర్షం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని సచివాయంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, ఎమ్మెల్సీ దండే విటల్, మాజీ ఎంపి సోయం బాబురావు, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, ఆసిఫాబాద్ డిసిసి అధ్యక్షులు విశ్వప్రసాద్, ఇతర నేతలతో కలసి ఆమె సిఎంను సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ తడోబా టైగర్ రిజర్వ్, కవ్వాల్ టైగర్ రిజర్వ్‌లను కలిపేందుకు వాటి మధ్యలో ఉన్న ప్రాంతాన్ని కన్సర్వేషన్ రిజర్వ్ గా ఏర్పాటు చేసేందుకు 2016 లోనే బీజం పడిందని గుర్తు చేశారు. ఇందుకోసం 2016 జూన్ 12న అంకుర్పార్పణ చేసిందని తెలిపారు. రాష్ట్ర వన్యప్రాణి బోర్డు మొదటి సమావేశంలో ప్రతిపాదిత ప్రాంతాన్ని కన్జర్వేషన్ రిజర్వ్‌గా ప్రకటించాలనే ప్రతిపాదనపై అప్పటి బిఆర్ఎస్ ప్రభుత్వం చర్చించిందని చెప్పారు.

అయితే ఈ జోవో పట్ల స్థానిక ప్రజలు అనుమానాలు, ఆందోళన వ్యక్తం చేయడంతో ఆదివాసీ, గిరిజన ఎమ్మెల్యేలతో సంక్షేమ భవన్‌లో జూన్ 10, 2025 సమావేశమై జీవో 49 ను నిలిపి వేయాలని నిర్ణయించినట్టు తెలిపారు. సీఎంను ప్రత్యేకంగా కలిసి స్థానిక ప్రజల ఆకాంక్షలను వివరించామని గుర్తు చేశారు. మరో వైపు మంత్రి కొండా సురేఖ, ఆదిలాబాద్ జిల్లా ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు, అటవీ అధికారులు, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్యేలతో 3 జూలై 2025 న సమావేశమై మరో సారి చర్చించి జీవో 49 ని నిలుపు దల చేసేందుకు నిర్ణయించినట్టు తెలిపారు.

విద్యార్థి సంఘాల విద్యాసంస్థల బంద్‌కు డివైఎఫ్ఐ మద్దతు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలనీ, ప్రయివేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేస్తూ వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో బుధవారం తలపెట్టిన రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్‌కు భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్, కార్యదర్శి ఆనగంటి వెంకటేశ్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రయివేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణ చట్టం తేవాలని అనేక ఏండ్లుగా విద్యార్థి, యువజన సంఘాలు పోరాటాలు చేశాయని తెలిపారు. ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తున్నదని పేర్కొన్నారు. రాష్ట్రంలో విద్యాశాఖకు మంత్రిలేకపోవడం వల్లే విద్యారంగం కుంటుపడిందని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న రూ.ఎనిమిది వేల కోట్ల ఫీజు బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక వసతులను కల్పించాలనీ, నిధులను కేటాయించాలని కోరారు. బెస్ట్ అవైలబుల్ స్కీం బకాయిలను విడుదల చేయాలని తెలిపారు. ఆర్‌టిసి బస్సుల్లో విద్యార్థులకు ఉచిత బస్‌పాస్ సౌకర్యం కల్పించాలని సూచించారు.

బిజెపి ఎంపిలు చిత్తశుద్ధితో వ్యవహరించాలి


- వి.హనుమంతరావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిసి రిజర్వేషన్ల పెంపునకు సంబంధించిన బిల్లును కేంద్రం పార్లమెంటులో ఆమోదించేలా బిజెపి ఎంపిలు చిత్తశుద్ధితో ప్రయత్నించాలని మాజీ ఎంపి వి హనుమంతరావు కోరారు. సోమవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం కులగణన చేసిందనీ, కేంద్రం షెడ్యూల్ తొమ్మిది చట్ట సవరణ చేసి 50 శాతం రిజర్వేషన్ సీలింగ్ ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. బిసి పక్షపాతులెవరో, వ్యతిరేకులెవరో దీనితో తేలిపోతుందన్నారు. బీసీ రిజర్వేషన్లపై ప్రధానమంత్రి మోడీ సంగతి పార్లమెంటులో చూస్తామని హెచ్చరించారు. బిసి రిజర్వేషన్ల పెంపునకు కాంగ్రెస్ పార్టీ పూర్తి మద్ధతు ఇస్తుందని స్పష్టం చేశారు.

ఎట్లుండె తెలంగాణ.. ఎట్లయ్యిందో

- కాంగ్రెస్ వచ్చాక అభివృద్ధి ఖతం
- అమలు కాని హామీలతో ప్రజలు ఆగం : హరీశ్‌రావు



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక తెలంగాణ అభివృద్ధి ఖతమైందని, బతుకుల తెలంగాణను గతుకుల తెలంగాణగా మార్చిన ఘనత సిఎం రేవంత్‌రెడ్డిదే అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. అమలు కాని హామీలతో ప్రజలను ఆగం చేశారన్నారు. సిద్దిపేట జిల్లా ప్రజ్ఞాపూర్ ఎస్ఎల్ఎన్ కన్వెన్షన్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గం ముఖ్య నాయకుల విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ప్రజలు పనుల్లేకుండా, అభివృద్ధి లేక అల్లాడుతున్నారన్నారు. 30 పైసల అభివృద్ధి చేసి.. 70 పైసల అభివృద్ధి ఎగ్గొట్టిన మహోన్నత వ్యక్తి సిఎం రేవంత్‌రెడ్డి అంటూ విమర్శించారు. ఇటీవల నిర్వహించిన సర్వే ప్రకారం.. రాష్ట్రంలో ఉన్న 31 జిల్లా పరిషత్‌లలో 16 నుంచి 18 పరిషత్‌లు బీఆర్ఎస్ సొంతం చేసుకోబోతుందన్నారు. జిల్లాలోని 26 మండలాల్లో మెజారిటీ స్థాయిలో గెలవాల్సిన అవసరం ఉందనీ, అందరూ కలిసి ఒక కుటుంబంగా పని చేయాలన్నారు. ఆత్మ విశ్వాసం ఉండాలి కానీ, అతి విశ్వాసం ఉండకూడదని తెలిపారు. ఎట్లుండె తెలంగాణ, ఎట్లయ్యిందో అనేది ప్రజలకు అర్థం అయ్యేటట్టు చెప్పాలని కార్యకర్తలకు హరీశ్‌రావు తెలిపారు. చెత్త ఎత్తెటోళు లేరు, బుగ్గలు వేసేవాళ్లు లేరు, మంచి నీళ్ల పైపు పగిలిపోతే అతుకపెట్టేవాడు లేడన్నారు. రాహుల్ గాంధీ పత్తాలేడని, రేవంత్‌రెడ్డి పోలీసు వలయం పెట్టుకుని తిరుగుతున్నడని ఆరోపించారు. కొత్తగా ఒక్క పింఛన్ ఇవ్వలేదని, కాని రకరకాల కారణాలు చెప్పి రెండు లక్షల పింఛన్లు కోత పెట్టిండని తెలిపారు. యూరియా కోసం పాస్ పుస్తకాలు, చెప్పులు లైన్‌లో పెట్టాల్సిన దుస్థితి మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం పునరావృతం చేసిందన్నారు. ఎపిలో ఎకరం అమ్మితే తెలంగాణలో పది ఎకరాలు కొనొచ్చని నాడు చంద్రబాబు అన్నాడని.. కెసిఆర్ సిఎం అయ్యాక తెలంగాణలో ఎకరం అమ్మితే, ఆంధ్రాలో పది ఎకరాలు కొనే పరిస్థితి వచ్చిందన్నారు. కానీ ఇప్పుడు రేవంత్ సిఎం అయ్యాక సీన్ మళ్లా రివర్స్ అయ్యిందన్నారు. అందరూ కలిసి పని చేసి, వచ్చే ఎన్నికల్లో సత్తా చాటాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి, నాయకులు వంటేరు ప్రతాపరెడ్డి, ప్రజాప్రతినిధులు, నియోజకవర్గ ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఇపికి వ్యతిరేకంగా ఉద్యమించాలి

- విద్యార్థులు రాజకీయాలను అధ్యయనం చేయాలి
- ఎస్ఎఫ్ఐ అఖిలభారత మాజీ అధ్యక్షులు ఆర్ అరుణ్ కుమార్


కార్యక్రమంలో మాట్లాడుతున్న అరుణ్ కుమార్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశంలో జాతీయ విద్యావిధానం (ఎన్ఈపీ-2020)కి వ్యతిరేకంగా ఉద్యమించాలని ఎస్ఎఫ్ఐ అఖిల భారత మాజీ అధ్యక్షులు ఆర్ అరుణ్‌కుమార్ పిలుపునిచ్చారు. ఎన్ఇపి పేరుతో దేశంలో విద్యా కార్పొరేటీకరణ, కాషాయీకరణ, వ్యాపారీకరణ కోసం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పూనుకుందని విమర్శించారు. పేద విద్యార్థులకు విద్యను దూరం చేసే కుట్రలో భాగంగానే ఎన్ఇపిని తెచ్చిందన్నారు. సోమవారం హైదరాబాద్‌లో ఐద్వా రాష్ట్ర కార్యాలయంలో డైలాగ్ విత్ అరుణ్‌కుమార్ కార్యక్రమాన్ని ఎస్ఎఫ్ఐ కేంద్ర కమిటీ సభ్యురాలు ఎం మమత అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా అరుణ్‌కుమార్ మాట్లాడుతూ దేశంలో ఎన్ఈపీ పేరుతో ప్రజాస్వామిక హక్కులపై బిజెపి ప్రభుత్వం దాడి చేస్తున్నదని విమర్శించారు. ఆర్ఎస్ఎస్ ఎజెండాను విద్యలో అమలు చేసే చర్యలకు పాల్పడుతున్నదని చెప్పారు. విద్యారుణాలు ఇచ్చి మరీ విదేశాలకు విద్యార్థులు వెళ్లేలా ప్రోత్సహిస్తున్నదని అన్నారు. దేశంలోని విద్యారంగాన్ని కార్పొరేట్, విదేశీ శక్తుల చేతుల్లో పెడుతున్నదని విమర్శించారు. దీనికి వ్యతిరేకంగా ఉద్యమించాలన్నారు. విద్యార్థులు నిరంతరం వారి చదువులతోపాటు రాజకీయాలను కూడా అధ్యయనం చేయాలని కోరారు. అప్పుడే వ్యవస్థలో ఉన్న అసమానతల కోసం పోరాడే తత్వాన్ని అలవర్చుకుంటారని అన్నారు. విద్యారంగంలో వస్తున్న సమస్యలను పరిష్కరించే దిశగా ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకుని పోరాటాల్లోకి రావాలని కోరారు. అరుణ్‌కుమార్ గురించి ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి నాగరాజు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు కిరణ్, బి శంకర్, అశోక్, రాష్ట్ర కమిటీ సభ్యులు కార్తీక్, లెనిన్, జె రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సూర్యాపేటలో భారీ దోపిడీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సూర్యాపేట జిల్లా కేంద్రంలో భారీ దోపిడీ జరిగింది. ఎంజి రోడ్డులో ఉన్న సాయి సంతోషి జ్యువెల్లరీ షాపులో దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన ఆదివారం రాత్రి జరిగింది. దొంగలు షాపు వెనుక భాగం గోడకు కన్నం వేసి లోపలికి ప్రవేశించి, గ్యాస్ కట్టర్‌తో షట్టర్, బీరువాలను కట్ చేశారు. రూ.18 కోట్ల విలువైన 18 కిలోల బంగారు ఆభరణాలను అపహరించుకుపోయారు. సోమవారం ఉదయం యజమాని షాపు తెరిచిన సమయంలో ఈ దొంగతనం వెలుగు చూసింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, ఐదు ప్రత్యేక బృందాలతో దర్యాప్తు ప్రారంభించారు. ఇందుకు సంబంధించి జిల్లా ఎస్పీ నర్సింహా తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట పట్టణంలో అత్యంత రద్దీగా ఉండే ఎంజీ రోడ్‌లో తెడ్ల కిషోర్‌కు చెందిన సాయి సంతోషి జ్యువెల్లరీ షాపు వెనుక భాగంలో ఆదివారం అర్ధరాత్రి దొంగలు బాత్రూం గోడకు కన్నం వేశారు. గ్యాస్ కట్టర్ సహాయంతో షట్టర్‌ను కట్ చేసి లోపలికి ప్రవేశించారు. రూ.18 కోట్ల విలువైన 18 కిలోల బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లిపోయారు. సోమవారం ఉదయాన్నే షాపు తెరిచేందుకు వచ్చిన యజమాని తెడ్ల కిషోర్ షట్టర్‌ను తీసేసరికి లోపల చిందరవందరగా ఉంది. బంగారు ఆభరణాలు కనిపించలేదు. వెంటనే 100 డయల్ ద్వారా పోలీసులకు సమాచారం అందించారు. జిల్లా ఎస్పీ నర్సింహా, డీఎస్పీ ప్రసన్నకుమార్, సీఐ వెంకటయ్య సంఘటనా స్థలానికి చేరుకుని క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌తో పరిశీలించారు. పరిసర ప్రాంతాల్లోని సీసీ కెమెరా ఫుటేజీలను పూర్తిగా పరిశీలిస్తున్నారు. అనుమానం ఉన్న వ్యక్తుల వేలిముద్రలు సేకరించి, స్థానికంగా గుర్తు తెలియని వ్యక్తుల కదలికలపై దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఐదు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దుండగుల కోసం గాలిస్తున్నారు.

ఉచితాలు తగ్గించి.. ఉపాధి కల్పించాలి

- రాజకీయ నాయకుల భాష బాధాకరం : సుఖేందర్‌రెడ్డి



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాజకీయ పార్టీలు ఉచితాలను కట్టడి చేసి.. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. ఉచితాలు ఇవ్వడం వల్ల రాష్ట్రాల ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటుందన్నారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో సోమవారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయ పార్టీలు ఉచిత పథకాల వాగ్దానాలు ఇవ్వకుండా కట్టడి చేసే విధంగా సుప్రీంకోర్టు, ఎన్నికల కమిషన్, కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఈ మధ్యకాలంలో రాజకీయ నాయకులు వాడే భాష చాలా ఘోరంగా ఉంటోందని, ప్రతిపక్షం, అధికార పక్షాలు తప్పుడు భాషను వాడి ప్రజల ఈ సడింపునకు గురికావొద్దని హితువు పలికారు. రాజ్యాంగ పదవులను గౌరవించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. రాజకీయ పార్టీల వైఖరితోనే అధికారుల్లో అవినీతి పెరిగిందని ఆరోపించారు. మాజీ ముఖ్యమంత్రులు జయలలిత, రాజశేఖరరెడ్డి లాంటి వాళ్ల వెంట ఏమీ తీసుకుపోలేదని చెప్పారు. అవినీతిపై ఎన్నికల సంఘం, సుప్రీం కోర్టు దృష్టి సారించాలన్నారు. ఎన్నికల్లో ఖర్చు చేసే విషయంలో కఠిన నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. నాగార్జున సాగర్ ఆయకట్టుకు ముందుగానే నీటి విడుదల చేయడం శుభ పరిణామమన్నారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, సాగునీటి శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మద్రాస్‌కు నీళ్ల తీసుకుపోవడానికి ప్రాజెక్టుల అనుసంధానం జరిగిందన్నారు. ఇచ్చంపల్లి నుంచి నాగార్జున సాగర్‌కు నీళ్ల వస్తే తెలంగాణకు మేలు జరుగుతుందని చెప్పారు. బనకచర్ల ప్రాజెక్ట్ వల్ల రాష్ట్రానికి నష్టం జరుగుతుందని, అందుకే తెలంగాణ గట్టిగా వ్యతిరేకిస్తోందని చెప్పారు. శాసనమండలి సభ్యులు తీన్మార్ మల్లన్న, కల్వకుంట్ల కవిత ఫిర్యాదులు అందాయని, అయితే ఇద్దరు ఎమ్మెల్సీల వ్యవహారం తనకు బాధను కలిగించిందని అన్నారు. చట్టపరంగా తన కర్తవ్యాన్ని నిర్వహిస్తానని స్పష్టం చేశారు.

ప్రతీ 20 సెకన్లకు ఒక్కరికి పక్షవాతం

- బ్రెయిన్ స్ట్రోక్‌పై ఐఎస్ఎ అవగాహన కార్యక్రమం

ప్రజాశక్తి - హైదరాబాద్

ఇండియన్ స్ట్రోక్ అసోసియేషన్ (ఐఎస్ఎ) ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో 'బ్రెయిన్ స్ట్రోక్-టైమ్ టు యాక్ట్' పేరుతో పక్షవాత అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. దేశంలో ప్రతీ నలుగురిలో ఒక్కరికి పక్షవాతం వస్తుందని ఐఎస్ఎ ప్రెసిడెంట్ డాక్టర్ విజయ తెలిపారు. ప్రతీ 20 సెకన్లకు ఒకరికి, సంవత్సరానికి 18 లక్షల మంది పక్షవాతం బారిన పడుతున్నారన్నారు. చికిత్స అందుబాటులో ఉన్నప్పటికీ కేవలం ఒక్క శాతం మంది మాత్రమే సకాలంలో చికిత్స పొందుతున్నారన్నారు. ప్రతీ నిమిషయంలో 20 లక్షల న్యూరాన్లు చనిపోతాయని.. కాబట్టి టైమ్ ఈజ్ బ్రెయిన్ అన్నారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యూరాలజిస్టులు, ఎమర్జెన్సీ ఫిజిషియన్లు స్ట్రోక్ చికిత్స, ఇమేజింగ్, థ్రాంబోలిసిస్, మెకానికల్ థ్రాంబెక్టమీ, హైపర్‌టెన్షన్ చికిత్స, స్ట్రోక్ యూనిట్ నిర్వహణపై శిక్షణ ఇచ్చారు. దీనికి ఐఎస్ఎ మాజీ అధ్యక్షుడు సుభాష్ కౌల్, ఐఎస్ఎ ట్రెజరర్ సలీల్ ఉప్పల్ తదితరులు హాజరయ్యారు.

కమ్యూనిస్టు యోధులు అచ్యుతానందన్

- సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కమ్యూనిస్టు యోధుడు విఎస్ అచ్యుతానందన్ మరణం పట్ల సిపిఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ సోమవారం ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. ఆయన ఈ తరానికి ఆదర్శమని పేర్కొన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

కూనంనేని సంతాపం

కేరళ మాజీ ముఖ్యమంత్రి విఎస్ అచ్యుతానందన్ మరణం పట్ల సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సంతాపం తెలిపారు. ఆయన బాల్యంలోనే చదువు మానేసి కార్మికుడిగా పనిచేసి కార్మిక నాయకుడిగా ఎదిగారని పేర్కొన్నారు. ట్రావెన్‌కోర్ సంస్థానంలో భూపోరాటం చేసి జైలుకెళ్లి రాజకీయ జీవితం గడిపారని తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు. అచ్యుతానందన్ మరణం పట్ల సీపీఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం సంతాపం తెలిపారు. నిరుపేద కుటుంబంలో జన్మించి లెనిన్, స్టాలిన్, మావోల జీవితాలతోపాటు ప్రపంచంలోనే కీలక ఘట్టాలను చూసిన వ్యక్తి అని పేర్కొన్నారు. అచ్యుతానందన్ మరనం వామపక్ష ఉద్యమాలకు తీరనిలోటని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కలపల్లి శ్రీనివాసరావు తెలిపారు.

25న భాగీదారీ న్యాయ సమ్మేళనం

- మహేశ్ కుమార్ గౌడ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్ పార్టీ, ఒబిసిల నాయకత్వంలో ఈ నెల 25న ఢిల్లీలో భాగీదారీ న్యాయ సమ్మేళనం జరుగుతుందని టిపిసిసి అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జనాభాలో 50 శాతం మించి ఉన్న ఒబీసీల అభివృద్ధికి దేశవ్యాప్త ఉద్యమం అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. ఆ సమ్మేళనంలో ప్రతినిధిగా పాల్గొనేందుకు జిల్లా లేదా రాష్ట్ర యూనిట్ ద్వారా పేర్లను నమోదు చేసుకోవాలని పార్టీ నాయకులకు సూచించారు. ఈ సమ్మేళనంలో నమోదు చేసిన డెలిగేట్లకు మాత్రమే ప్రవేశం ఉంటుందని పేర్కొన్నారు.



మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌పి డివి శ్రీనివాసరావు

వీడిన జిల్లా ఎస్‌సి నేత మారెల్లి అనిల్ హత్య మిస్టరీ

- బీహార్ నుంచి నాటు రివాల్వర్
- మెదక్ జిల్లా ఎస్‌పి డివి శ్రీనివాసరావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మెదక్ జిల్లాలో సంచలనం సృష్టించిన మెదక్ జిల్లా ఎస్‌సి నేత మరెల్లి అనిల్ హత్య మిస్టరీ వీడిందని, కేసులో ప్రధాన నిందితులను అరెస్టు చేశామని మెదక్ జిల్లా ఎస్‌పి డివి శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం జిల్లా ఎస్‌పి కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ నెల 14న సాయంత్రం ఎనిమిది గంటల సమయంలో వరిగుంతం సబ్ స్టేషన్ వద్ద గుర్తుతెలియని వ్యక్తులు మరెల్లి అనిల్‌ను కాల్చి చంపిన విషయం తెలిసిందే. కొల్చారం మండలం పైతర గ్రామానికి చెందిన సోమన్నగారి రవీందర్ రెడ్డి, మరెల్లి అనిల్ మధ్య అనేక విభేదాలు ఈ హత్యకు దారి తీశాయని తెలిపారు. జిల్లా అడిషనల్ ఎస్‌పి మహేందర్ పర్యవేక్షణలో ఇద్దరు డిఎస్‌పిలు, ఐదుగురు సిఐలు, ఏడుగురు ఎస్ఐలతో కలిసి ఏడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ఏ విధమైన ఆధారాలు లేని కేసును ఛేదించి నిందితులను పట్టుకున్నారు. ఈ కేసులో మొత్తం ఏడుగురు నిందితులను గుర్తించగా, ఐదుగురిని అరెస్ట్ చేశారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నారు. కుల్చారం మండలం పైతర గ్రామానికి చెందిన సోమన్నగిరి రవీందర్ రెడ్డి ఏ1గా, రంగంపేట్ గ్రామానికి చెందిన పడేపు నాగరాజు ఏ2 గా, ఏ3గా పడేపు నాగభూషణం, ఏ4 శాబొద్దిన్, ఏ5 ఫరీద్, ఏ6 చిన్నా (విజయవాడ) ఏ7 తలారి అశోక్‌పై కేసు నమోదు చేసినట్టు ఎస్‌పి తెలిపారు. వారిపై బిఎన్ఎస్ సెక్షన్ 103(1), ఆర్మ్ యాక్ట్ సెక్షన్ 25(1), 27 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ హత్యకు వాడిన సిఫ్ట్ కారు, మారుతి కారును ధ్వంసం చేశారు. టియాగో కారు, డిసిఎం, పిస్టల్‌తో పాటు సెల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ మహేందర్, మెదక్ డిఎస్‌పి ప్రసన్న కుమార్, రూరల్ సిఐ రాజశేఖర్, అల్లాదుర్గ్ సిఐ రేణుక రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.